

భద్రత కల్పించాలి

రోగుల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో మేము పని చేస్తుంటాం. మా విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడి వచ్చినా అధిగమిస్తాం. కానీ కొంత మంది మృగాల వల్ల మహిళా వైద్యులతో పాటు సిబ్బందికి ఇబ్బందికర పరిస్థితులు తప్పడం లేదు.ఆస్పత్రుల్లో నైట్ డ్యూటీలు చేసే మహిళ వైద్యులకు సరైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. సింగిల్ వైద్యురాలు ఉన్న చోట ఆమె వెంట అదనంగా కొంత మంది మహిళా సిబ్బంది ఉండాలి. సెక్యూరిటీ వ్యవస్థను మరింత పెంచితే మహిళ వైద్యులకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తవు. ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ వందన లక్ష్మి, సివిల్ అసిస్టెంట్ సర్జన్





పోలీస్ అవుట్ పోస్టులు పెట్టాలి

రోగుల ఆరోగ్య భద్రత కోసం పని చేస్తున్న వైద్యులకు సరైన భద్రత కరవవుతోంది. కొంత మంది కారణంగా నైట్ డ్యూటీలు చేసేందుకు మహిళా వైద్యులు భయపడాల్సిన పరిస్థితి వస్తోంది. రాత్రి పగలు అన్న తేడా లేకుండా పని చేస్తున్న వైద్యులకు అవసరమైన భద్రత కల్పించాలి. ఆస్పత్రులకు సమీపంలో పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలి. అలాగే ఆస్పత్రుల్లో మరింత సెక్యూరిటీ పెంచాలి. మహిళా వైద్యులకు సహాయకులుగా మహిళా సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే కోల్‌కతాలో జరిగిన లాంటి ఘటనలకు ఆస్కారం ఉండదు.

– డాక్టర్ కె.జీవిత, గైనకాలజిస్ట్

క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ



ఉత్సవ రాట వేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు ఓల్డ్ కరాసలో వినాయక చవితి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉత్సవ రాట మహోత్సవాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ బంగారమ్మ–శ్రీ దుర్గాలమ్మ ఆలయ కమిటీ, రాక్ స్టార్స్ సంయుక్తంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నగిరెడ్డి వినోద్, దివాకర్,బాబీ, గోపి, రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ యువకులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు రూ. 88 వేలు ఖరీదు చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వేస్టేషన్‌లో గల వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని సుమారు రూ. 88 వేల విలువైన 17.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఎస్.కె. అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో చేసిన దాడుల్లో ఆర్పీఎఫ్ ఎస్ఐ అభిషేక్ మిస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

పెదగంట్యాడ: హిందూజా పవర్ ప్లాంట్‌కు సంబంధించిన యాష్ పాండ్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస ప్రాంతంలోని హిందూజా పవర్‌ప్లాంట్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాలవలస, దేవాడ, నమ్మిదొడ్డికి చెందిన వారితో మాట్లాడారు. హిందూజా పవర్ ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్టీపీసీ, హిందూజా యాజమాన్యాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. హిందూజా పవర్ ప్లాంట్ యాష్ పాండ్ కారణంగా వాతావరణం కలుషితమైందని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన పవర్ ప్లాంట్‌కు రైల్వే లైన్ వేస్తే కాలుష్యం సమస్య తగ్గుతుందని, దీని కోసం కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. ఎంపీకి సమస్యలు వివరించిన వారిలో కాకి బాబు, నక్కా శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

ఏయూలో స్వచ్ఛ భారత్

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆచార్యులు ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లో వ్యర్థాలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. త్వరలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

నాడు: నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కుల నిర్వహణకు పెద్దపీట వేసింది. పిచ్చిమొక్కలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పార్కులు గతి మార్చింది. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ప్రజలు వ్యాయామం చేసుకోవడానికి వీలుగా ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసింది. పిల్లలు, పెద్దలు సేదతీరడానికి బెంచీలు వంటి వసతులు కల్పించింది. ఇళ్లకు సమీపంలోనే వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలు పార్కులకు క్యూ కట్టేవారు.

నేడు: పార్కుల నిర్వహణ గాడి తప్పింది. పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అడుగు పెట్టడానికి వీల్లేకుండా ఉన్నాయి. జిమ్ పరికరాలు ఉపయోగానికి దూరంగా ఉన్నాయి.ఫలితంగా ప్రజలకు ఆహ్లాదం కరువయ్యే పరిస్థితి వచ్చింది. దీనికి నిదర్శనంగా జీవీఎంసీ 52వ వార్డులోని గౌరీనగర్ పార్కులోని దుస్థితినే చెప్పవచ్చు.



ఓపెన్ జిమ్ పరికరాల చుట్టూ పెరిగిన గడ్డి

ఆహ్లాదం దూరం!

- పార్కుల నిర్వహణ అస్తవ్యస్తం
- జిమ్ పరికరాలు ఉపయోగించుకోలేని వైనం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



జీవీఎంసీ 52వ వార్డులోని గౌరీ నగర్‌లోని పార్కు

విశాఖ విద్య: కొద్ది రోజుల కిందట వరకూ సందడిగా ఉన్న పార్కులు నేడు కళ తప్పాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో సందర్శకులు వెళ్లడానికి భయపడుతున్నారు. చెత్తా చెదారం పెరిగిపోతోంది. గడ్డి ఏపుగా పెరగడంతో క్రిమి కీటకాలు, పాములు సంచరిస్తున్నాయని ప్రజానీకం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజానీకం పార్కుల వైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

నిర్లక్ష్యమెవరిది?

జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లోని పార్కు అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. పార్కులో అడుగు పెట్టాలంటేనే భయమేస్తుంది. బల్లల చుట్టూ చెత్త పేరుకుపోయింది. పార్కులో నడిచేందుకు వీల్లేకుండా చుట్టూ మొక్కలు పెరిగాయి. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్‌లలో ఉండే మహిళల కోసం ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా మారాయి. గమ్మత్తయిన విషయం ఏంటంటే పార్కుకు పక్కనే జీవీఎంసీ కార్యాలయం కూడా ఉంది. అధికారులు సైతం రోజూ ఇక్కడికి వచ్చి పోతుంటారు .కానీ పక్కనే ఉన్న పార్కు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం . ఇదొక్కటే కాదు....పశ్చిమ నియోజకవర్గంలోని దాదాపు చాలా పార్కుల్లో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం!

వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతలో శానిటరీ విభాగం కీలకపాత్ర పోషిస్తుంది. ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా ప్రత్యేకంగా జీవీఎంసీలో ఉద్యానవన విభాగం సైతం ఉంది. మొక్కల పెంపకం, వాటి పరిరక్షణ వంటి బాధ్యతలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. కానీ ఉద్యానవన విభాగం అధికారులు పార్కుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. మరో వైపు శానిటరీ విభాగ అధికారులు తమ బాధ్యత కాదనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా నగరవాసుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు సైతం నిరుపయోగంగా మారుతున్నాయి నగరపాలక సంస్థ కమిషనర్ ఇలాంటి సమస్యలపై దృష్టి పెట్టాలని కాలనీల వాసులు కోరుతున్నారు. పార్కులను సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని వారు విన్నవిస్తున్నారు.



నడిచే దారి ఇలా



పార్కులో కూర్చొనే బల్లల చుట్టూ వేసిన చెత్త

14న మెగా లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు

గాజువాక: సుప్రీం కోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు వచ్చేనెల 14న గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా జడ్జి జె.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక అదనపు జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అదాలత్లో అన్ని రకాల బ్యాంకు కేసులు, భూతగాదా కేసులు, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు, మోటారు ప్రమాదాల్లో పరిహారానికి సంబంధించిన కేసులు, ఇన్సూరెన్స్, విద్యుత్, నీరు, టెలిఫోన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో రేపు కృష్ణాష్టమి వేడుకలు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పూజలు, గోపూజ, సాయంత్రం ఉట్టి సంబరాలు జరుగుతాయన్నారు. 12 ఏళ్లలోపు బాలబాలికలు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలు అలరిస్తారని.. భక్తులంతా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు

సింథియా : మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలో 35వ రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ రెజి.వి.ఆర్.విశ్వనాథ్ ప్రత్యేక న్యాయమూర్తిగా వ్యవహరించిన పోటీల్లో నెల్లూరు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, జేవీ పికెట్ హైదరాబాద్, కేవీ ఎన్ఏపీఏ హైదరాబాద్, కేవీ బొల్లారం హైదరాబాద్, కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ పోటీల్లో కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం, కేవీ నెల్లూరు, కేవీ పికెట్ హైదరాబాద్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ లేబర్ గేటు వద్ద శనివారం కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణకు పాల్పడడం శాపంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ప్లాంట్ పునరుజ్జీవనానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గాజువాక: వచ్చేనెల 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉక్కునగరంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల పోస్టర్‌ను ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 370 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. సమావేశాల ముగింపు సందర్భంగా 3వ తేదీన నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వరంగంలోనే కొనసాగించడంతోపాటు కంపెనీకి ఐరన్‌ఓర్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ సమావేశాల్లో తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజబాబు, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు పాల్గొన్నారు.

పిల్లల్ని మనమే కాపాడుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

సీతమ్మధార: మాదక ద్రవ్యాల వైపు పిల్లలు ఆకర్షితులవకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై లైంగిక దాడులు, మంచి–చెడు స్పర్శల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెల ఏర్పాటుపై డీఈవో చంద్రకళ చొరవ అభినందనీయమన్నారు. ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నందున, వారి మనసులను అన్ని కోణాల్లోనూ అనుకూలంగా మార్చేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీసా బేగం సమన్వయకర్తగా, ఎంఈవోలు డి.రామారావు, బాలమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, మనస్తత్వ నిపుణులు ఎం.సాయి, వంశీ, పార్వతీ కశ్యప్, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిమర్స్ ఘటనలో హామీలు అమలు చేయలేదు

- ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్ ఘటనలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఎమ్మెల్యే గణబాబు విమర్శించారు. అచ్యుతాపురంలో జరిగిన ఫార్మా ప్రమాదంలో బాధితులను పరామర్శించేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గణబాబు స్పందించారు. గోపాలపట్నంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎల్జీ దుర్ఘటన తర్వాత హైలెవల్ కమిటీ ఇచ్చిన రికమెండేషన్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాటించలేదని విమర్శించారు. అలాంటి తమ ప్రభుత్వం సక్రమంగా స్పందించలేదని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.

చిన్నోడి పెద్ద మనసు



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

దాబాగార్డెన్స్ : ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యకు దూరం అవుతుంటారు చాలా మంది పేద విద్యార్థులు. అటువంటి వారికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చాడు 17 ఏళ్ల రోహన్ చెర్ల. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణమూర్తి విశాఖ మహా నగరంలో గల ఏవీఎన్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పని చేశారు. ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. ఈ మేరకు ఏవీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోహన్ చెర్ల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జోసెఫ్ మార్షల్, సాయి హిరణ్మయి చెర్ల, రోహన్ కమత్, ఆకెళ్ల శైలజ, డాక్టర్ మహలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు



రాధాకృష్ణ, గోపికల వేషధారణల్లో చిన్నారులు



లక్కీ అమర్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో చిన్నారులు

మల్కాపురం: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. 60వ వార్డు లోని స్వామి వివేకానంద పాఠశాలలో పాఠశాల ఎల్‌కేజీ, యూకేజీ,ఒకటి,రెండు తరగుతుల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆడిపాడి సందడి చేశారు. కరస్పాండెంట్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ దాసరి రేణుక తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. పలు తరగతుల విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణల్లో అలరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెర్క్స్ సర్క్యులర్ ఉప సంహరించాల్సిందే..



అధికారులతో మాట్లాడుతున్న సీజీఎం శ్రీధర్

ఉక్కు అధికారుల సంఘ నాయకుల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారుల పెర్క్స్ తగ్గిస్తూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ఉక్కు అధికారులు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. 2007 నుంచి వేతన ఒప్పందం తర్వాత అధికారులకు పెద్ద మొత్తంలో పెన్షన్ ఫండ్ బకాయిలు, 2011లో పీఆర్సీ చెల్లించే సమయంలో అన్యాయంగా కోత విధించిన ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఐదేళ్లుగా పదోన్నతులు ఇవ్వకపోవడం వల్ల కోల్పోయిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఐదు నెలలుగా నిలిపేసిన పీఎఫ్, గ్రాట్యూటీ బకాయిలు, అధిక మొత్తంలో కరెంటు చార్జీలు, చనిపోయిన అధికారుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ చెల్లింపులు, త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు అన్నీ కలిపి సుమారు రూ. 2400 కోట్లకు పైగా ఉక్కు యాజమాన్యం బకాయి పడిందన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వల్ల డిఫాల్టర్లుగా మారుతున్నామన్నారు. ఈ పరిణామాల వల్ల సుమారు 300 మంది యువ అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. కాంట్రాక్టు కార్మికుల బయోమెట్రిక్ హాజరు అంశంపై సుమారు 200 మందికి పైగా షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు

మురళీనగర్ : ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్‌జేడీ జె. సత్యనారాయణమూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫసర్ డాక్టర్ కె. రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేఈ శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఒ.రామ్మోహనరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, కె.మధుకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.